క్లుప్తంగా

కానిస్టేబుల్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంక్



ఉపేందర్‌ను సన్మానిస్తున్న కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు

నల్లగొండ : తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో స్థానిక అవనిగడ్డ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన విద్యార్థి ఎస్.ఉపేందర్‌కు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంక్ సాధించాడు. ఈ సెంటర్‌లో కోచింగ్ తీసుకున్న వారిలో 100మంది కానిస్టేబుల్ ఉద్యోగం సాధించినట్లు, అందులో ఉపేందర్ ఉత్తమ ర్యాంకు సాధించినట్లు కోచింగ్ సెంటర్ నిర్వాహకులు శేఖర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకు సాధించిన ఉపేందర్‌ను ఆయనతో పాటు పలువురు సన్మానించారు.

హోంమంత్రి దిష్టిబొమ్మ దహనం



హోంమంత్రి మహమూద్ అలీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఎస్పీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ తన సెక్యూరిటీ సిబ్బందిపై చేయి చేసుకోవడాన్ని నిరసిస్తూ బీఎస్పీ నాయకులు శనివారం పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్‌లో హోంమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ.. పోలీస్ సెక్యూరిటీపై చెయిచేసుకున్న హోంమంత్రిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హోంమంత్రిని వెంటనే మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలన్నారు. కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనుముల సురేష్ స్వేరో, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోడి భీంప్రసాద్, పాషా, ఒంటెపాక యాదగిరి, వినోద్ పాల్గొన్నారు.

కోర్టు భవన నిర్మాణ పనుల పరిశీలన

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని జిల్లా కోర్టులో నూతనంగా నిర్మిస్తున్న భవనం పనులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు, కలెక్టర్ ఆర్‌వి కర్ణన్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిల్డింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. పార్టిషన్, లిఫ్ట్ పనులు వెంటనే చేయాలన్నారు. అదే విధంగా రోడ్డు విస్తరణ పనులు కూడా చేపట్టాలని అన్నారు. పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. వారి వెంట అదనపు జడ్జి జయరాజు, ఆర్‌అండ్‌బీ ఈఈ నరేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కేవీ.రమణాచారి తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



మంచినీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ స్వరూపరాణి

మునుగోడు : మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని జెడ్పీటీసీ నారబోయిన స్వరూపరాణిరవి అన్నారు. మండల కేంద్రంలో తన జెడ్పీ నిధుల నుంచి రూ.4లక్షలతో చేపట్టనున్న మంచి నీటి పైపులైన్ పనులను శనివారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే తన నిధుల ద్వారా మండలంలో దాదాపు రూ.5కోట్ల అభివృద్ధి పనులు చేయించామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జనిగల మహేశ్వరిసైదులు, ఎంపీటీసీ వనం నిర్మలయాదయ్య, బీఆర్‌ఎస్ నాయకులు బుడిగపాక ఏసు, వనవ లింగయ్య, జి.యాదయ్య, దోటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని వివేకానందనగర్ శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో నాగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మాజీ కౌన్సిలర్ మొరిశెట్టి నాగేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎల్‌ఓసీ పత్రాలు అందజేత

చిట్యాల : పట్టణానికి చెందిన అమరోజు కృష్ణ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో అతడి వైద్య ఖర్చులకుగాను మంజూరైన రూ.8లక్షల ఎల్‌ఓసీ పత్రాలను నార్కట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పోన్నం లక్ష్మయ్యగౌడ్, నరేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి ఉన్నారు.

తెల్ల బంగారానికి తెగుళ్ల బెడద

- మొదటి కాతకే పరిమితమైన పత్తిచేలు
- ఆందోళనలో రైతన్నలు

మర్రిగూడ : ఆరుగాలం కష్టించి సాగుచేసిన పత్తి చేలు మొదటి కాత దశలోనే తెగుళ్ల బారిన పడడంతో రైతన్నలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. మర్రిగూడ మండల వ్యాప్తంగా 20 గ్రామ పంచాయతీలు 25 ఆవాసాల్లో 16,002 మంది రైతులు ఉన్నారు. మండల వ్యాప్తంగా రైతులు ఈ ఏడాది పత్తి 29,158 ఎకరాలు, వరి 5,150 ఎకరాలు, జొన్న, సజ్జ 57 ఎకరాలు, కంది 42 ఎకరాల్లో మొత్తం 34,407 ఎకరాల్లో పంటలు సాగు చేశారు.

సకాలంలో వర్షాలు కురవక..

విత్తనాలు నాటేందుకు రైతులు ముందస్తుగా వేసవి కాలంలోనే దుక్కులు దున్ని చదును చేస్తారు. పత్తి పంటను 50శాతానికి పైగా రైతులు రోహిణి కార్తెలో సాగు చేస్తారు. నాటి నుంచి నేటి వరకు సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పత్తి చేలు బెట్టకు గురయ్యాయి. పూత, కాయ దశలో నీరు అందకపోవడంతో బావులు, మోటార్లు కలిగిన రైతులు మాత్రం నీటిని అందించి పంటలను కాపాడుకుంటూ వస్తున్నారు.

ఎర్ర గుమ్మడి తెగులు..

మర్రిగూడ మండలంలో అధిక సంఖ్యలో ఎర్ర భూములు ఉన్నాయి. ఈ భూముల్లో పత్తి పంటను సాగు చేయడం ఆనవాయితీగా మారింది. పంట మార్పిడి చేయకపోవడంతో మొదటి దశలోనే ఎర్ర గుమ్మడి తెగులు సోకి దిగుబడి శాతం తగ్గింది. పేనుబంక, పల్లాకు తెగులు ఇలా పలు రకాల తెగుళ్లు సోకుతుండడంతో రైతులకు అధిక పెట్టుబడులు తప్పడం లేదు. అయినప్పటికీ తగిన



రాంరెడ్డిపల్లిలో ఎర్ర గుమ్మడి తెగులు సోకిన పత్తి చేను

ప్రతిఫలం దక్కకపోవడంతో అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రతి ఏటా అతివృష్టి లేదా అనావృష్టి కారణంగా పంటలు ఆశాజనకంగా ఉండకపోవడంతో అప్పులు పెరిగి ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

కౌలు రైతులకు అధిక కష్టాలు..

వ్యవసాయంపై మక్కువ ఉన్న సన్న, చిన్నకారు రైతులు ఐదు నుంచి పదెకరాల వరకు భూములు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తుంటారు. దుక్కి దున్ని చదును చేసిన నాటి నుంచి పంట చేతికొచ్చే వరకు ఎకరాకు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చు వస్తుంది. ఎకరానికి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు కౌలు చెల్లించాల్సి ఉంటుంది. నీటి వసతి కలిగిన భూములకు ఇంకాస్త ఎక్కువగానే చెల్లించాల్సి ఉంటుంది. ఆశించిన దిగుబడి వచ్చినా, రాకపోయినా భూ యజమానికి కౌలు చెల్లించాల్సిందే. పంట నష్టపోయినప్పుడు కౌలు రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని కౌలు రైతులు కోరుతున్నారు.

పెట్టుబడి కూడా వచ్చేలా లేదు



నాకున్న రెండెకరాలతో పాటు ఆరు ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి పంట వేశా. వర్షాలు లేకపోవడంతో పత్తి చేలుకు తెగులు సోకింది. దానిని నివారించేందుకు మందులు పిచికారీ చేస్తున్నాం. పత్తి తీయక ముందే తెగులు సోకడంతో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరి స్థితి కనిపించడం లేదు. కౌలు డబ్బులు కూడా అప్పులు తెచ్చి చెల్లించాల్సిన పరిస్థితి నెలకొ ంది. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలి.

–చాపల లింగస్వామి, రైతు, శివన్నగూడ

తెగుళ్ల నివారణకు చర్యలు



పత్తి పంటలో సోకే తెగుళ్లను ఎప్పటికప్పుడు రైతులు గుర్తించి వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలి. ప్రస్తుతం పత్తిపంటకు సోకే ఎర్రగుమ్మడి తెగులు నివారణకు మెగ్నీషియం సల్ఫేట్, యూరియా ఒక్కొక్కటి పది గ్రాముల చొప్పున ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పేను బంక, పచ్చదోమ, తామర పురుగుల నివారణకు ఇమీడాక్లోపిరైడ్ 0.25 గ్రాముల చొప్పున లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే తెగుళ్లను నివారించవచ్చు. వ్యవసాయాధికారులను సంప్రదించి వారి సూచనలు మేరకు మందులను పిచికారీ చేసి పంటలను కాపాడుకోవాలి.

– హేమలత, ఏఓ, మర్రిగూడ

అల్పాహారాన్ని రుచిగా తయారు చేయాలి

- అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

చండూరు : విద్యార్థులకు పాఠశాలల్లో వడ్డించే అల్పాహారాన్ని రుచిగా తయారు చేయాలని అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ఆయన మండలంలోని బంగారిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమలు చేస్తున్న సీఎం అల్పాహార పథకం తీరును ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. అనంతరం విద్యార్థులను అల్పాహారం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు మెనూ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆయన వెంట జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్ రెడ్డి, ఎంఈఓ గురువారావు, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

అల్పాహారాన్ని పరిశీలించిన ఆర్డీఓ

నల్లగొండ : పట్టణంలోని పద్మనగర్‌లో గల మిర్యాల కమలమ్మ వెంకటేశం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందించే అల్పాహార



చండూరు : విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

కార్యక్రమాన్ని శనివారం నల్లగొండ ఆర్డీఓ రవి పరిశీలించారు. అనంతరం ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిరోజు విద్యార్థులకు అల్పాహారం మెనూ ప్రకారం అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు కిచిడిని ఆర్డీఓ స్వయంగా వడ్డించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ అరుంధతి, హెచ్‌ఎం నవ్వ గమనేశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

బీసీ అభ్యర్థిని సీఎం చేయాలి

రామగిరి(నల్లగొండ) : తెలంగాణలో బీసీ అభ్యర్థిని సీఎంగా ఎంపిక చేయాలని బీసీ ముఖ్యమంత్రి సాధన సమితి చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ అన్నారు. పట్టణ పరిధిలోని ఎంజీయూలో ఈనెల 9న నిర్వహించే కాన్షీరామ్ 17వ వర్ధంతి కార్యక్రమ పోస్టర్‌ను ఆయన శనివారం స్థానిక క్లాక్ టవర్ సెంటర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జనాభాలో 52శాతం బీసీలు ఉన్నా సీఎం పదవి నోచుకోక అణచివేతకు గురవుతున్నారని అన్నారు. 18శాతం ఉన్న దళితులకు సీఎం చేస్తానని చెప్పిన కేసీఆర్ దళితులను మోసం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ వినోద్‌కుమార్

చేశారన్నారు. తెలంగాణలో బహుజనుల పాలన రావాలన్నారు. కార్యక్రమంలో డాక్టర మేడి రమణ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మర్రిగూడ : ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు మహమ్మద్ వాహిద్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆశా వర్కర్లు నిర్వహిస్తున్న సమ్మె శనివారం 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం రూ.18వేలు, ప్రమాదబీమా, హెల్త్‌కార్డులు అందించాలని కోరారు. కార్యక్రమంలో మట్టం భాగ్యమ్మ, జంపాల వసంత, ఏర్పుల పద్మ, బీమనపల్లి అరుణ, రమావత్ జయమ్మ, కోయ మంజుల, పల్లె కౌసల్య, పతంగి దుర్గమ్మ, కాలం సుజాత, అనిత, కలమ్మ పాల్గొన్నారు.

హైవేపై ఆశా వర్కర్ల రాస్తారోకో

రామగిరి(నల్లగొండ) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం తిప్పర్తి మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి అద్దంకి రహదారిపై ఆశావర్కర్లు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, లేకుంటే తమ సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వారిని పోలీసులు అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో తిప్పర్తి మండల ఆశా వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ఆందోళన

కేతేపల్లి : మండల కేంద్రంలోని పీహెచ్‌సీ కేంద్రం



మర్రిగూడ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా వర్కర్లు

ఎదుట ఆశా వర్కర్లు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శనివారం 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు ఈఎస్‌ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు సునీత, ఆదిలక్ష్మి, లక్ష్మి, రేణుక, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కనీసవేతనం ఇవ్వాలి

నాంపల్లి : ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె ఆశా వర్కర్లకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ము భిక్షం, పానగంటి వెంకటయ్య, గాదేపాక వేలాద్రి, దామెర సర్పంచ్ యాదగిరి, నాంపల్లి సంజీవ, మల్లయ్య, ఆశాలు తదితరులు ఉన్నారు.



నాంపల్లి : సంఘీభావం తెలుపుతున్న కృష్ణారెడ్డి



కేతేపల్లిలో ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

'వేతనాలు చెల్లించే వరకు సమ్మె కొనసాగిస్తాం'

నల్లగొండ టౌన్ : వేతనాలు చెల్లించే వరకు మధ్యాహ్న భోజన వర్కర్ల సమ్మె కొనసాగుతుందని ఆ సంఘం నాయకుడు పోలె సత్యనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు నిర్వహిస్తున్న ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమ్మెకు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సత్తయ్య, అనురాధ, అండాలు, రమ, పుష్పలత, ఇంద్ర, మహేశ్వరీ, ముత్యాలి, రమణమ్మ, బేబమ్మ, శంకరమ్మ, కలమ్మ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

చిట్యాల : మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జ్ మేడి ప్రియదర్శిని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న కార్మికులకు ఆమె సంఘీభావం తెలిపి



చిట్యాల : సమ్మెకు మద్దతు తెలుపుతున్న మేడి ప్రియదర్శిని

మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.26వేల వేతనాన్ని చెల్లించాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు గద్దపాటి రమేష్, మండల అధ్యక్షుడు గ్యార శేఖర్, మునుగోటి సత్తయ్య, జోగు శేఖర్, జోగు యోగి పాల్గొన్నారు.

రాచకాల్వలో వృథానీటికి అడ్డుకట్ట



రాచకాల్వకు పడిన గండిని ఇసుకబస్తాలతో పూడ్చిన రైతులు

శాలిగౌరారం : శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చే ప్రధాన రాచకాల్వలో రామన్నపేట మండలం తుర్కపల్లి గ్రామసమీపంలో బంధం కత్వ వద్ద పడిన గండ్లను రైతులు శనివారం రామగిరి సర్పంచ్ బండారు శంకరయ్య, శాలిగౌరారం ప్రాజెక్టు మాజీ నీటి సంఘం చైర్మన్ చాడ హతీష్‌రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చామల వెంకటరమణారెడ్డి నేతృత్వంలో శ్రమదానం చేసి పూడ్చివేశారు. ప్రస్తుతం మూసీనదిలో వరదప్రవాహం జరుగుతున్నప్పటికీ శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చే రాచకాల్వలలో గుర్రపుడెక్క ఆకు పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీంతో బంధం కత్వవద్ద గండ్లుపడి నీరువృథా పోతుంది. ఈ నేపథ్యంలో రైతులు రాచకాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క ఆకుతో పాటు చెత్తాచెదారాన్ని తొలగించారు. అదేవిధంగా బంధం కత్వవద్ద పడిన గండ్లకు ఇసుకబస్తాలు వేసి పూడ్చి నీటివృథాను అరికట్టారు. ఇదిలా ఉండగా శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం పల్లివాడ వద్ద మూసీనదిపై అడ్డంగా ఆనకట్ట నిర్మించడంతో పాటు శాలిగౌరారం ప్రాజెక్టులోకి సాగునీరు వచ్చేందుకు హెడ్‌రెగ్యులేటర్‌ను నిర్మించారు. ఈ హెడ్ రెగ్యులేటర్ నుంచి సుమారు 30కిలోమీటర్లు రాచకాల్వను నిర్మించారు. ఈ రాచకాల్వకు యాదాద్రిభువనగిరి జిల్లాలోని రామన్నపేట, నల్లగొండ జిల్లాలోని నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలాలకు చెందిన పలు చెరువులు, కుంటలు అనుసంధానమై ఉన్నాయి. ప్రస్తుతం మూసీ వరద వస్తుండడంతో శాలిగౌరారం ప్రాజెక్టులోకి హెడ్‌రెగ్యులేటర్ ద్వారా వరదనీటిని మళ్లించారు. ఈ శ్రమదాన కార్యక్రమంలో మండలంలోని రామగిరి, శాలిలింగోటం, ఎన్‌జీ కొత్తపల్లి గ్రామాలకు చెందిన రైతులు నూనెముంతల ఆంజనేయులు, శీలం శంకర్, సత్తెనపల్లి శ్రీను, పాక సైదులు, నిమ్మల రాములు, శ్రీశైలం, వీరస్వామి, లోడె సర్వయ్య, లింగాల అంజయ్య, మరో 20మంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి : గ్రామాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని భీమారం గ్రామంలో రూ.40లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్లు, డ్రెయినేజీలు, రూ.20లక్షలతో జనరల్ కమ్యూనిటీహాల్ భవన నిర్మాణానికి శనివారం వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో నిరాదరణకు గురైన పల్లెలు నేడు సీఎం కేసీఆర్ పాలనలో సమగ్రాభివృద్ధిని సాధిస్తున్నాయన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అవార్డులు దక్కించుకోవడంతో అభివృద్ధికి రోల్ మోడల్‌గా మారిందన్నారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ బడుగుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం వెంకట్



కేతేపల్లి : సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బడుగుల, ఎమ్మెల్యే చిరుమర్తి

రెడ్డి, చిమట వెంకన్న, ఇనుపాముల శివాలయ కమిటీ చైర్మన్ కానుగు యాదగిరి పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం

నకిరేకల్ : నియోజకవర్గ కేంద్రమైన నకిరేకల్ పట్టణాన్ని రూ.150కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తెలిపారు. పట్టణంలో రూ.26కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ, సెంట్రల్‌లైటింగ్, జంక్షన్ నిర్మాణం, ఫుట్‌పాత్



నకిరేకల్ : పట్టణ ప్రధాన కూడలిలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నిర్మాణ పనులను శనివారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. పనులు చివరి దశకు వచ్చినట్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఇప్పటికే 100పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ ఏఈ గౌతమ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, మాజీ ఎంపీటీసీ గుర్రం గణేష్, నాయకులు మాద నగేష్, జాఫర్, యాతాకుల సోమయ్య ఉన్నారు.

సోలిపురం వంతెనకు నిధులు మంజూరు

మునుగోడు : మండలంలోని సోలిపురం గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న వాగుపై వంతెన నిర్మాణానికి ఎట్టకేలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఎంతో కాలంగా తమ గ్రామానికి వెళ్లే మార్గంలో వాగుపై వంతెన నిర్మాణం చేస్తే బాగుండన్న గ్రామస్తుల ఆశలు చిగురించాయి. ఆ గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేక వాగుపై వంతెన కూడా లేకపోవడంతో వర్షాకాలంలో ఆ గ్రామం నుంచి ఇతర గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతుంటాయి. దీంతో ఆ గ్రామానికి వచ్చిన ప్రతీ ప్రజాప్రతినిధులకు, అధికారులకు వాగుపై వంతెన నిర్మాణం చేయించాలని పలుమార్లు మొరపెట్టుకున్నారు గ్రామస్తులు. గత ఏడాది ఉప ఎన్నికల సందర్భంగా మునుగోడుకు వచ్చిన జిల్లా మంత్రి జగదీష్‌రెడ్డికి గ్రామస్తులు విన్నవించడంతో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలిచిన వెంటనే వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు.



సోలిపురం గ్రామానికి వాగులో నుంచి వెళ్తున్న గ్రామస్తులు

ఇచ్చిన హామీ ప్రకారం మంత్రి జగదీష్‌రెడ్డి చిన్న నీటిపారుదల శాఖ నుంచి రూ.404.50లక్షల నిధులు మంజూరు చేయించారు. దీంతో గ్రామస్తుల నిరీక్షణకు తెరపడింది. ఈ విషయం తెలిసిన గ్రామస్తుల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చండూరు : మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొట్టు శివకుమార్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో తెలంగాణ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో కార్మికులు పనులు చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నల్లగంటి లింగస్వామి, కత్తుల సైదులు, నర్సింహ, నగేష్, చంద్రమ్మ, కళమ్మ, జంగమ్మ, ఎల్లమ్మ తదితరులు ఉన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు

గొర్రెలు పంపిణీ చేయాలని లబ్ధిదారుల ఆందోళన

మర్రిగూడ : గొర్రెల పంపిణీకి తాము డీడీలు తీసి ఏడాది గడిచినా ఇప్పటికీ పంపిణీ చేయడంలేదని, వెంటనే గొర్రెలను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మండలంలోని శివన్నగూడ పశువైద్యశాల ఎదుట లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గట్టుప్పల్ మండలం నామాపురంలో దాదాపు 70కి పైగా గొర్రెల యూనిట్లు మంజూరైనప్పటికీ 30యూనిట్లు పంపిణీ పూర్తయ్యిందని, మిగతా 36 యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉండగా అందులో 30మందికి త్వరలో పంపిణీ చేయనున్నట్లు, ఆరు యూనిట్ల పంపిణీ నిలుపుదల చేస్తున్నారని వారికి అందిన సమాచారం మేరకు ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతోనే గొర్రెల పంపిణీలో జాప్యం జరుగుతున్నట్లు వారు ఆరోపించారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో గొర్రెలను పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో గుండెబోయిన ఊషయ్య, ముత్యాల మల్లయ్య, వంగూరి శివరాజు తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిని రెవెన్యూ డివిజన్ చేయాలి

నాంపల్లి : నాంపల్లి మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్ చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో వారు రిలే దీక్ష నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్యే నాంపల్లి మండలంపై చవితి తల్లి ప్రేమ చూపుతున్నారని, చండూర్, చౌటుప్పల్, నారాయణపురం మండలాలపైన ఉన్న ప్రేమ నాంపల్లి మండలంపై లేదని అన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ము భిక్షం, పానగంటి వెంకటయ్య, బీఎస్పీ మండల అధ్యక్షుడు పల్లేటి వినోద్‌కుమార్, గాదెపాక వేలాద్రి, నాంపల్లి సంజీవ, పానగంటి మహేష్, రామావత్ పంత్యానాయక్, తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మర్రిగూడ : మండల కేంద్రంలో ఈనెల 11న నిర్వహించే పొలిటికల్ ఫ్రంట్ ఉద్యమకారుల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఫ్రంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నారపాక అంజి అన్నారు. శనివారం మండల కేంద్రంలో సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సమావేశానికి ఆయా పార్టీల నాయకులు, విద్యార్థులు, తెలంగాణ ఉద్యమకారులు, ఆయా సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఫ్రంట్ నియోజకవర్గ చైర్మన్ మాల్గ యాదయ్య, ఎంఎస్‌ఎఫ్ జాతీయ నాయకులు జిల్లా వెంకటేష్‌మాదిగ, నాయకులు నెల్లికంటి రాఘవేందర్, కోరె సాయిరాం, వడ్డె వెంకటేష్, యాదగిరి, మారయ్య, అంబాల రవిగౌడ్, వెంకటాచారి, ఏర్పుల యాదయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శౌర్య జాగరణ యాత్రను విజయవంతం చేయాలి

రామగిరి(నల్లగొండ) : హిందువుల ఐక్యతను చాటి చెప్పేందుకు విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే శౌర్య జాగరణ యాత్రను విజయవంతం చేయాలని భజరంగ్ దళ్ తెలంగాణ ప్రాంత కో కన్వీనర్ వెంకట్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని రామాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శౌర్య జాగరణ యాత్ర పట్టణంలోని పాతబస్తీ హనుమాన్ దేవాలయం నుంచి క్లాక్‌టవర్ వరకు జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి జూకూరి సంపత్‌వర్మ, రాయల కృష్ణయ్య, అంకెశెట్టి హరిప్రసాద్, చిలుకూరి గోవర్ధన్, వెలిజాల నర్సింహ, పచ్చల వంశీ, కంచనపల్లి చంద్రశేఖర్, గద్దం శంకర్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతాకు ఆధార్ లింక్ చేయించుకోవాలి

చిట్యాల : వానాకాలంలో పత్తి పంటను సాగు చేసిన రైతులంతా తమ బ్యాంకు ఖాతాలు ఆధార్ లింక్ చేయించుకోవాలని చిట్యాల వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి జానయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేసిన అనంతరం రైతులకు వారి ఖాతాలో నగదు బదిలీ చేసేందుకు ఆధార్ లింక్ ఉపయోగపడుతుందన్నారు. ఈ వానాకాలంలో పత్తి క్వింటాళ్లకు కనీస మద్దతు ధర రూ.7020లు సీసీఐ ద్వారా అందజేయనున్నట్లు తెలిపారు.

బీజేపీ అభ్యర్థిగానే మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పోటీ

మర్రిగూడ : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మునుగోడు నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బీజేపీ అభ్యర్థిగానే పోటీ చేస్తారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పార్టీ మారుతున్నట్లు వస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో మునుగోడులో బీజేపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ మేతరి యాదయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, జమ్ముల వెంకటేష్‌గౌడ్, ఎలిమినేటి సత్తిరెడ్డి తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ రవి తెలిపిన ప్రకారం.. చిట్యాల పట్టణానికి చెందిన ఇరగిండ్ల ఇస్తారి(55), సురేష్ శుక్రవారం రాత్రి బైక్‌పై వెళ్తూ పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకుంటుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఇస్తారి మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.